యాదగిరీశుడికి కల్యాణోత్సవ సేవ

యాదగిరిగుట్ట, మే 2 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ వైభవంగా జరిగింది. గురువారం ఉదయం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై ఊరేగించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో నిజాభిషేకం జరిపించారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం జరిగింది. సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు నిర్వహించారు. గురువారం సుమారు 18 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.28,87,191 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

దాచూరి రామిరెడ్డి చిత్రపటం వద్ద నివాళర్పిస్తున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

యాదగిరిగుట్ట, మే 2 : ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే పిల్లలకు మెరుగైన విద్య అందుతున్నదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రెసిడెన్సియల్ సూట్ ఆడిటోరియంలో ఉపాధ్యా ఉద్యమ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి 8వ వర్ధంతి సభ నిర్వహించారు. సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే బాధ్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలను పెంచుకునే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, ప్రతి తరగతికి ఉపాధ్యాయుడు ఉండే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె. జంగయ్య, చావా రవి, ఉపాధ్యక్షులు రాములు, దుర్గ భార్గవి, కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు వెంకట్, నాగమణి, రాజశేఖర్‌రెడ్డి, గాలయ్య, సత్యానంద్, సోమశేఖర్, శాంతి కుమారి, రంజిత్ కుమార్, జ్ఞాన మంజరి, రవికుమార్‌తో పాటు 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సమాచారహక్కు చట్టం మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు

పారదర్శక పాలనే సమాచార హక్కు చట్టం లక్ష్యం

- సహ చట్టం మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు

చౌటుప్పల్, మే 1 : ప్రజలకు పారదర్శకమైన పాలన అందించేలా చేయడమే సమాచార హక్కు చట్టం లక్ష్యమని సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం చౌటుప్పల్ పట్టణంలోని షాదీఖానలో సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత అవినీతి బాగా తగ్గిందన్నారు. విద్యాహక్కు, గ్రామీణ ఉపాధిహామీ చట్టాలు, గ్రామాల్లో పాలనా వ్యవస్థ పకడ్బందీగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఖుర్షీద్ పాషా అధ్యక్షతన జరిగిన సదస్సులో మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎంఏ.కరీం, సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రమాద కృష్ణారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు కానుగుల వెంకటయ్య, షాదీఖాన చైర్మన్ ఎండీ ఖలీల్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ భూక్య సుశీల, అధికారులు

మట్టి అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

తుర్కపల్లి, మే 2 : మండలంలోని పలు గ్రామాల నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై అధికారులు ఎందుకు చర్యలు చేపట్టడంలేదని పలువురు ఎంపీటీసీ సభ్యులు అధికారులను నిలదీశారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ భూక్య సుశీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే పలువురు ఎంపీటీసీ సభ్యులు మట్టి అక్రమ రవాణాపై అధికారులను నిలదీశారు. ప్రతిరోజు మట్టి వాహనాలు తాసీల్దార్ కార్యాలయం ముందు నుంచే వెళ్తున్న ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్లలో లీకేజీలు ఉన్నాయని, వాటిని సరి చేసి తాగునీరు అందించాలని కోరారు. అనంతరం అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. సమావేశంలో జడ్పీ వైస్‌చైర్మన్ బీకునాయక్, ఎంపీడీఓ జాన్సీలక్ష్మీబాయి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నరసింహారెడ్డి, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెల్లంకి గ్రామ నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ యాకూబ్‌నాయక్

హరితహారానికి మొక్కలు సిద్ధం : ఎంపీడీఓ

రామన్నపేట, మే 2: జూన్‌లో చేపట్టే హరితహారం కార్యక్రమంలో నాటేందుకు మొక్కలు సిద్ధంగా ఉన్నాయని ఎంపీడీఓ యాకూబ్‌నాయక్ అన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలోని నర్సరీని, పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏపీఓ వెంకన్న, పంచాయతీకార్యదర్శి యాదయ్య ఉన్నారు.

ఆశీర్వదించండి.. తెలంగాణ గొంతుకను ఢిల్లీలో వినిపిస్తా

- భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్
- బొమ్మలరామారం, రాజపేట మండలాల్లో కార్యకర్తల సమావేశాలు



బొమ్మలరామారం : సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

బొమ్మలరామారం/రాజాపేట, మే 2 : తనను ఎంపీగా ఆశీర్వదిస్తే తెలంగాణ ప్రజల గొంతుకను ఢిల్లీలో వినిపిస్తానని భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. గురువారం బొమ్మలరామారం మండలంలోని నాగినేనిపల్లి, బొమ్మలరామారం, చీకటిమామిడి, మర్యాల, రాజాపేట మండలంలోని రాజాపేట, పాముకుంట, బొందుగుల, రఘునాథపురం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక లోకసభ ఎన్నికల్లో గెలిపిస్తే హామీలను అమలు చేస్తామని చెప్పడం మరోసారి ప్రజలను మోసం చేయడమే అని అన్నారు. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ పాలన నిజస్వరూపం బయటపడిందని, వారికి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధరతోపాటు రూ.500 బోనస్‌గా చెల్లిస్తామని చెప్పిన సీఎం ధాన్యం కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. రైతులను దగా చేసిన కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తాను క్రమశిక్షణగల కార్యకర్తగా పని చేశానన్నారు. తెలంగాణ ప్రజల ఆశయాల సాధనకు, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, సూదగాని హరిశంకర్‌గౌడ్, కల్లూరి రాంచంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్‌గౌడ్, ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, గూదె బాలనర్సింహ పాల్గొన్నారు.

రాజాపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, వేదికపై ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

రాజాపేటలో జరిగిన సమావేశంలో సమావేశంలో జడ్పీటీసీ చామకూర గోపాల్‌గౌడ్, ఎంపీపీ గోపగాని బాలమణీయాదగిరిగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గొల్లపల్లి రాంరెడ్డి, సెక్రెటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, నాయకులు బెడిదే వీరేశం, గుంటి మధుసూదన్‌రెడ్డి, మర్ల నాగరాజు, కొండం రాజు, కటకం వెంకటేశం, సట్టు తిరుమలేశ్, రేగు సిద్ధులు, కాకల్ల ఉపేందర్, ఎర్రగోకుల జశ్వంత్, రామిండ్ల నరేందర్, కటకం స్వామి, డొంకెన మహేందర్‌గౌడ్, మ్యాక వెంకటేశ్వర్‌రెడ్డి, బిల్లకుదురు రాజు, గుర్రం సిద్ధిరాములు, డీలర్ పోచయ్య, గుర్రాల బాలకనకయ్య, దొబ్బల గణేశ్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి తీరు మార్చుకోవాలి : ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీత

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసత్య మాటలు మాట్లేడే తీరును మార్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం వివిధ గ్రామాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాల అనంతరం బొమ్మలరామారంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై రెండ్రోజుల నిషేధం విధించడం దురదృష్టకరమన్నారు. కేసీఆర్ ప్రచారానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి తట్టుకోలేక బీజేపీ, కాంగ్రెస్ కేసీఆర్‌పై ఎన్నికల కమిషన్‌కు తప్పుడు ఫిర్యాదు చేయడం వారి చేతగానితనానికి నిదర్శనమన్నారు. మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేయలేక ఓడిపోతామనే భయంతో కేసీఆర్‌పై ఎన్నికల కమిషన్‌కు తప్పుడు ఫిర్యాదులు చేసినట్లు ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రెండు సీట్లకే పరిమితం కావడం ఖాయమన్నారు. తెలంగాణ గోస తీరాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

'నేటి హరీశ్‌రావు రోడ్‌షోకు బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలి'

చౌటుప్పల్, మే 1 : చండూర్ మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించే మాజీ మంత్రి హరీశ్‌రావు రోడ్‌షోకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పార్టీ మండలాధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. రోడ్‌షోకు వెళ్లే సందర్భంలో హరీశ్‌రావుకు చౌటుప్పల్ పట్టణకేంద్రంలో ఘనంగా స్వాగతం పలుకనున్నట్లు తెలిపారు.

రూ.13.48 లక్షలు పట్టివేత

భువనగిరి అర్బన్, మే 2: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో వాహనాల తనిఖీ కొనసాగుతోంది. గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న 28.06 లీటర్ల మద్యం, రూ.13,48,661 నగదును పట్టుకున్నామని, 19 మందిని బైండోవర్ చేశామని డీసీపీ రాజేశ్‌చంద్ర తెలిపారు. ఆధారాలు లేకుండా డబ్బులు తీసుకెళ్లినా, అక్రమంగా మద్యం తరలించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేటి నుంచి రామలింగేశ్వర కల్యాణోత్సవం

ఆత్మకూరు(ఎం), మే 2 : మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు ఈ నెల 3 నుంచి 5 వరకు జరుగనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గుండెగాని ఐలయ్యగౌడ్ గురువారం ఒక ప్రటకలో తెలిపారు. ఈ నెల 3న గరుడబలి, శివపార్వతుల కల్యాణం, 4న రథోత్సవం, స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, 5న గ్రామ దేవతలకు బోనాలు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజాదరణ ఓర్వలేకనే కుట్రలు

- బీఆర్ఎస్‌వీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నె ప్రభాకర్

రాజాపేట, మే 2 : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్రకు వస్తున్న ప్రజాదరణ ఓర్వలేకను కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కుట్రలు పన్నుతున్నారని బీఆర్ఎస్వీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నె ప్రభాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడేభాయ్, ఛోటేభాయ్ ఒక్కటై ఈసీని అడ్డుపెట్టుకొని కేసీఆర్ ప్రచారం చేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. మాయ మాటలు చెప్పి అధికారంలో వచ్చిన నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేక వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. విద్యార్థి నాయకుడు, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి క్రిశాంక్ అక్రమ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. వెంటనే క్రిశాంక్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సిమెంట్, హార్డ్‌వేర్ దుకాణాల యజమానుల సంఘం కార్యవర్గం

ఆత్మకూరు(ఎం), మే2 : సిమెంట్, ఎలక్ట్రికల్స్ హార్డ్‌వేర్ దుకాణాల యజమానుల సంఘం సమావేశం గురువారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోరె బీరప్ప, ఉపాధ్యక్షుడిగా ఎండీ ఉస్మాన్, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్‌రెడ్డి, కోశాధికారిగా అశోక్ ఎన్నికయ్యారు.

తాళం వేసిన ఇండ్లల్లో చోరీ

గుండాల, మే 2: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో తాళం వేసిఉన్న మూడు ఇండ్లల్లో బుధవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఊట్ల వీరేశం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి డాబాపై నిద్రించాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 3 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలతో పాటు, రూ.20 వేల నగదును ఎత్తుకెళ్లారు. అన్నోజు సత్తయ్య కూడా ఇంటికి తాళం వేసి డాబాపై నిద్రిస్తుండగా దొంగలు తాళం పగులగొట్టి 10 తులాల వెండి. రూ.2 వేల నగదు, అదే గ్రామానికి చెందిన తవిటి సోమక్క ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువాలో ఉన్న రూ.6 వేల నగదును ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ యాకన్న కేసు నమోదు చేసి క్లూస్ టీం ద్వారా వేలి ముద్రలను సేకరించారు.

స్కూటీ అదుపు తప్పి వ్యక్తి మృతి

భువనగిరి అర్బన్, మే 2 : స్కూటీ అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టగా వ్యక్తి మృతి చెందిన ఘటన భువనగిరి పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పట్టణ పరిధిలోని రాయగిరికి చెందిన గుమ్మడి రాజు(50) ఆర్ఎంపీగా విధులు నిర్వహిస్తూ భువనగిరికి స్కూటీపై వచ్చి తిరిగి వెళ్తుండగా పశువుల దాణా కేంద్రం వద్ద ప్రమాదవశాత్తు రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య, పెద్ద కుమారుడు గతంలో కరోనాతో మృతి చెందారని, తల్లిని, అన్నను, ఇప్పుడు తండ్రిని కోల్పోయిన చిన్నకుమారుడు అనాథగా మారడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

- అడ్డగూడూరు, మోత్కూరులో బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం

అడ్డగూడూరు, మే 2 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. గురువారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి ఉపాధి కూలీలతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. పార్లమెంట ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ దర్శనాల అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ పూలపల్లి జనార్దన్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు మాదాను ఆంథోని, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నాగుల పల్లి దేవగిరి, మాజీ ఉపసర్పంచ్ వడకాల రణధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

అడ్డగూడూరు : ఉపాధి హామీ కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మోత్కూరు : పాటిమట్లలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మోత్కూరులో ప్రచారం

మోత్కూరు : బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పార్టీ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని సదర్శాపురం, పాటిమట్ల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నార్మాక్స్ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకుబ్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గిరగాని శ్రీను, మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను, గ్రామ శాఖ అధ్యక్షుడు దొండ నర్సయ్య, బండి రాజు, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మల్లం అనిత, నాయకులు శైలజ, ఇంద్రజ్యోతి, కొండ సోంమల్లు పాల్గొన్నారు.

ఎండ @ 45.5 డిగ్రీలు

భువనగిరి కలెక్టరేట్, మే 2 : జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అడ్డగూడూరు మండలంలో అత్యధికంగా 45.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవగా, మోత్కూర్‌లో 45.3, ఆత్మకూరులో 45 డిగ్రీలు, సంస్థాన్ నారాయణపురం 44.6, మోటకొండూర్ 44.1, గుండాల 44, చౌటుప్పల్ 43.8, పోచంపల్లి 43.8, యాదగిరిగుట్ట 43.7, బొమ్మలరామారం 43.7, భువనగిరి 43.7, వలిగొండ 43.5, ఆలేరు 43.4, రామన్నపేట 43, బీబీనగర్ 42.9, రాజపేటలో 42 డిగ్రీలు, తుర్కపల్లిలో 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆత్మకూరు(ఎం) : కప్రాయపల్లిలో ఎండ వేడి నుంచి రక్షణ కోసం నెత్తిన తాటాకులు పెట్టుకొని వెళ్తున్న మహిళ, ఆమె కూతురు

ఓటింగ్ శాతం పెరిగేలా అవగాహన కల్పించాలి

- కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరి కలెక్టరేట్, మే 2 : ఓటింగ్ శాతం పెరిగేలా ఓటర్లకు అవగాహన కల్పించాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె. జెండగే రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా, ఓటరు స్లిప్పుల పంపిణీ, ఈవీఎంల ర్యాండమైజేషన్, పోస్టల్ బ్యాలెట్స్, హోమ్ ఓటింగ్‌ను వివరించారు. మొత్తం 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి 2141 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 18,08,585 ఓటర్లు ఉన్నారని ఇప్పటి వరకు 12,65,046 మందికి ఓటరు స్లిప్పులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ నెల 4న ఈవీఎంల రెండో విడుత ర్యాండమైజేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 13న పోలింగ్ సమయాన్ని గంట పాటు పొడిగిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందని, ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల విధులకు సంబంధించి 13213 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్నారని, 656 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారని తెలిపారు. 1364 మంది హోమ్ ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టరు పి. బెన్ షాలోమ్, నాగేశ్వరాచారి పాల్గొన్నారు.

క్రీడాకారులకు జర్కిన్లు అందిస్తున్న గౌటే ఫౌండేషన్ ప్రతినిధి

క్రీడాకారులకు జర్కిన్లు అందజేత

రాజాపేట, మే 2 : మండల కేంద్రానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు గురువారం గౌటే ఫౌండేషన్ ప్రతినిధి పద్మావతీలక్ష్మణ్ దంపతులు జర్కిన్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులు క్రీడల్లో రాణించి తమ ప్రాంతానికి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో సున్నంబట్టి రాజు, మరిమడ్ల కనకయ్య, రాంగోల్ల శ్రీనివాస్, దోమల ఆంజనేయులు, గౌటే అరుణ్, భాస్కర్, నరేశ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కృష్ణ

ఉపాధి కూలీలకు కనీస వేతనం అందేలా చూడాలి

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కృష్ణ

మోత్కూరు, మే 2: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు రోజువారి సగటు వేతనం రూ.300 వచ్చేలా చూడాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం. కృష్ణ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మోత్కూరు, గుండాల, అడ్డగూడూరు మండలాలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఈజీఎస్ పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కూలీలు పనులను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా పని ప్రవేశంలో తాగు నీటి వసతితో పాటు నీడ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. క్షేత్ర పరిశీలకులు పనులను ప్రతి రోజు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో ఏపీడీ శ్యామల, ఆయా మండలాలకు చెందిన ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండ్లి చేసుకుంటానని మోసం చేశాడంటూ ధర్నా

సాయి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న బాధితురాలు

భూదాన్‌పోచంపల్లి, మే 2 : ప్రేమించి పెండ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరుతూ ప్రియుడి ఇంటి ముందు యువతి ధర్నా నిర్వహించిన ఘటన భూదాన్‌పోచంపల్లి మండలం కప్రాయిపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి చెందిన బోళ్ల నాగమణి(21), భూదాన్‌పోచంపల్లి మండలం కప్రాయిపల్లి గ్రామానికి చెందిన గంగాదేవి సాయి(22) చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం ఇండస్ట్రియల్ పార్కులో పని చేస్తుండగా ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వీరిద్దరూ ఇంట్లో చెప్పకుండా జనవరి 21న శ్రీశైలం వెళ్లి వీరభద్ర స్వ